సమస్యలను పరిష్కరించండి సారూ..


శివ శంకర్ మైదానంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

- శాలిబండలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు
- పలు ప్రాంతాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు


కాజిపురాలో పొంగిపొర్లుతున్న మురుగు

శాలిబండ: శాలిబండ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. శాలిబండ డివిజన్‌లోని శివ శంకర్ మైదానం, కాజిపురా, ఘాజిబండ తదితర పలు ప్రాంతాల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. రంజాన్ మాసం సందర్భంగా స్థానిక ప్రాంతాల్లో ప్రార్థనలు నిర్వహించడానికి వెళ్లలేక పోతున్నామని స్థానిక ముస్లింలు వాపోతున్నారు. చెత్త కుప్పలను పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోతుందని స్థానికులు వాపోతున్నారు. దీంతో తాము అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాజిపురా ప్రాంతంలో ఇళ్ల మధ్య కొన్ని రోజులుగా డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రంజాన్ మాసం సందర్భంగా సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని చెబుతున్నారనే తప్పా.. ఆచరణలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి రంజాన్ పండుగకు ముందు పారిశుద్ధ్య, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



రంజాన్ మాసం ఉపవాస దీక్షలు నిర్వహిస్తున్న తమకు పారిశుద్ధ్య సమస్యతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. రంజాన్ మాసం సందర్భంగా ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామంటున్న అధికారులు ఆచరణలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేదు. దీంతో బస్తీల్లో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయి. రంజాన్ పండుగ సందర్భంగా సమస్యలను వెంటనే పరిష్కరించాలి.
– హబీబ్ అబ్దుల్లా సంకారీ, శివ శంకర్ మైదానం

అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి..



తమ బస్తీల్లో పారిశుద్ధ్య సిబ్బంది చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించడం లేదు. దీంతో అపరిశుభ్రత కారణంగా అనారోగ్యాల బారిన పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. బస్తీల్లో చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించే విధంగా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. – మహ్మద్ సయ్యద్, ఖాజిపురా

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ఆహ్వానం


మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కొమ్ముల నరేందర్

అబిడ్స్: దళితులకు అండగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం నిలిచిందని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా, పర్యాటక శాఖమంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. దళితుల కోసం తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. ఈనెల 21న బాబూ జగ్జీవన్‌రామ్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే కేసీఆర్‌కు అభినందన సభ ఆహ్వాన పత్రాన్ని చైర్మన్ కొమ్ముల నరేందర్ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బాబూ జగ్జీవన్‌రామ్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ బడుగు బలహీన వర్గాల కోసం చేస్తున్న కృషి అమోఘమన్నారు. విద్యారంగానికి చైర్మన్ కొమ్ముల నరేందర్ అండగా ఉండి పలు విధాల సహకారాలు అందిస్తున్నారని కొనియాడారు. సచివాలయానికి డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ పేరు నామకరణం చేయడం దేశంలోనే రికార్డు అని చైర్మన్ కొమ్ముల నరేందర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హన్మంత్ నాయక్, ఉప్పు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు చేయూత


వికలాంగుడి ఫిర్యాదు వింటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: వికలాంగులు, సీనియర్ సిటిజన్లకు తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలీచౌకి మేరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవారు ఆయన ముందు తన ఫిర్యాదులను వెల్లబోశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన సీనియర్ సిటిజన్లు వైద్యుల ధ్రువపత్రాలు ఉన్న వికలాంగులు పెన్షన్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైనవారికీ పెన్షన్లు ఇప్పించే బాధ్యత తనదేనని ఆయన అన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో ఇప్పటివరకు ఆసరా పెన్షన్లు పొందినవారు ఎందరో ఉన్నారని, అదేవిధంగా ఒంటరి మహిళ పథకం ద్వారా కూడా ఒంటరి మహిళలు ఆసరా పెన్షన్లు పొందుతున్నారన్నారు. అనంతరం ఆయన పలువురు మహిళలను కలిసి వారి ఫిర్యాదులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసిరుద్దీన్, హబీబ్ చావూస్, సయ్యద్ జబ్బార్ తదితరులు ఉన్నారు.

ఉత్తర భారతీయులకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం


నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను సత్కరిస్తున్న రాజ్ పురోహిత్ సమాజ్ నాయకులు

అబిడ్స్: ఉత్తర భారతీయులకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. నూతనంగా గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను ఉత్తర భారతీయులైన రాజ్ పురోహిత్ సమాజ్‌వారు బేగంబజార్‌లో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. రాజ్‌పురోహిత్ సమాజ్ వారు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కరిస్తానన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం వ్యాపారులకు అండగా ఉందన్నారు. వ్యాపారుల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం, వారి ప్రగతి కోసం ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌పురోహిత్ సమాజ్ అధ్యక్షుడు జోగ్ సింగ్‌జీ, ఇతర నాయకులు బల్వంత్‌సింగ్, బబూత్‌సింగ్, కిశోర్ సింగ్, శంకర్ సింగ్, విజయ్ సింగ్, హరిసింగ్, రాజ్‌పురోహిత్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్‌లో ఫిత్రా తప్పనిసరి


సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రి

గోల్కొండ: రంజాన్ మాసంలో ప్రతిఒక్క ముస్లిం ఫిత్రా తప్పనిసరిగా ఇవ్వాలని కుతుబ్‌షాహీ ఈద్గా కతీబ్ మౌలానా ఖారి సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రి అన్నారు. మంగళవారం ఆయన ఫిత్రా వివరాలను వెల్లడించారు. ఒక్కో వ్యక్తి రెండున్నర కిలోల గోదుమలు లేదా దానికి సమానమైన డబ్బును ఫిత్రాగా ఇవ్వాలని ఆయన తెలిపారు. కుటుంబంలో వయస్సుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ ఫిత్రా ఇవ్వాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఈ విధంగా లెక్కించిన ఫిత్రా డబ్బులను నిరుపేదలకు ఇవ్వాలని ఆయన సూచించారు. ఫిత్రా ప్రతి ఒక్కరూ ఇవ్వాలని దివ్య ఖురాన్ గ్రంథంలో స్పష్టంగా ఉందని ఆయన అన్నారు. ఫిత్రా ఇవ్వని వారి నమాజ్‌లు, వారి ఉపవాస దీక్షలు దేవుని సన్నిధిలో చేరకుండా భూమి, ఆకాశానికి మధ్యలోనే ఉండిపోతాయని ఆయన అన్నారు. ఫిత్రాను రంజాన్ పండుగ కంటే ముందు లేదా రంజాన్ పండుగ రోజు సూర్యాస్తమయం లోపల ఇవ్వవచ్చని ఆయన స్పష్టం చేశారు.

ఉస్మానియాలోనికి ద్విచక్ర వాహనాలను అనుమతించాలి


పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న బీజేపీ పక్షనేత శంకర్‌యాదవ్, ఆర్‌ఎంఓ డాక్టర్ రఫీ, శ్రీధర్

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా ఆస్పత్రిలోనికి ద్విచక్ర వాహనాలను అనుమతించాలని జీహెచ్‌ఎంసీ బీజేపీ పక్షనేత గొంటి శంకర్‌యాదవ్ డిమాండ్ చేశారు. చికిత్సలు పొందే రోగులను పరామర్శించేందుకు వెళ్లే రోగుల సహాయకుల వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయాలని ఆయన ప్రశ్నించారు. ఆస్పత్రి అధికారులు ద్విచక్ర వాహనాలను ఆస్పత్రి లోనికి అనుమతించకపోవడంతో గత్యంతరం లేని స్థితిలో ఆస్పత్రి ఓపీ గేట్ వద్ద పార్కు చేసి లోనికి వెళ్తున్నారు. ఓపీలో చికిత్సలు పొందే రోగులు, ఇన్‌పేషంట్లుగా చికిత్స పొందే వారిని పరామర్శించి వచ్చే సరికి ట్రాఫిక్ పోలీసులు క్రేన్‌లో తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం బేగంబజార్‌లోని కొంత మంది వ్యాపారులతో కలిసి డ్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ రఫీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయనతో కలిసి ఓపీ గేటు బయట, బర్తన్ బజార్ తదితర ప్రాంతాలను పరిశీలించారు.

మురుగు పరుగును అరికట్టాలి


జలమండలి జీఎం నాగేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గోల్కొండ: కార్వాన్ మెయిన్ రోడ్డుపై కొంతకాలంగా మురుగునీరు ప్రవహిస్తున్నదని, దీనిని అరికట్టాలని కార్వాన్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధి గోదా లక్ష్మీకాంత్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు ఆయన అసోసియేషన్ సభ్యులతో మంగళవారం గుడిమల్కాపూర్ నవోదయ కాలనీలోని జలమండలి జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మురుగు వల్ల పాదచారులు, వాహనదారులే కాకుండా వ్యాపారులు సైతం ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. రోడ్డు పక్కన ఉన్న షాపుల ముందు మురుగు గుంటలు ఏర్పడ్డాయని, ఈ కారణంగా కొనుగోలుదారులు షాపులలోకి రావడం లేదని ఆయన అన్నారు. గత కొంతకాలంగా ఇదే పరిస్థితి నెలకొని ఉన్నదని ఆయన అన్నారు. ఈ మురుగు పరుగు కారణంగా తమ వ్యాపారాలు దెబ్బ తింటున్నాయని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. రామబులేకర్, విజయ్‌కుమార్, దర్శన్ సింగ్, రాజేష్ పాండ్యా, చిన్నా ఉన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ


కానుకలను పంపిణీ చేస్తున్న సలావుద్దీన్ లోథీ

చార్మినార్: రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలు పాటించే ముస్లిం ప్రజలకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటుందని బీఆర్‌ఎస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోథీ అన్నారు. చార్మినార్‌లోని మూసా ఖాద్రీ దర్గా వద్ద మంగళవారం ఆయన రంజాన్ కానుకలను ముస్లిం మహిళలకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ... రాబోయే ఈద్-ఉల్-ఫితర్ కోసం కూడా ప్రభుత్వం ఇప్పటి నుంచే తగిన ఏర్పాట్లు చేస్తుందన్నారు. రంజాన్ పండుగ రోజు ముస్లిం ప్రజలు పెద్ద ఎత్తున సామూహిక ప్రార్థనల్లో పాల్గొంటారన్నారు. ఇందుకు అవసరమైన షామియానాలతో పాటు జానీమాజ్‌లను ఏర్పాటు చేస్తుందన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గౌలిపురా: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్యవంతులను చేస్తున్నామని మొఘల్‌పురా అగ్నిమాపక కేంద్రం ఎస్ఎఫ్ఓ ప్రేమ్‌కుమార్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గౌలిపురాలోని శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీలో అగ్ని ప్రమాదాల నివారణపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా వ్యాపార ప్రదేశాలు, గ్యాస్ ఏజెన్సీలు, భవనాలు, పాఠశాల, కళాశాలతో పాటు రద్దీ ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్యవంతులను చేస్తున్నామన్నారు. వ్యాపార సముదాయాల్లో వ్యాపారులు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వేసవి కాలం నేపథ్యంలో ప్రస్తుతం పలు ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు 101 డయల్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వీల్‌చైర్ అందజేత



నాంపల్లి: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ మెట్రోపాలిటన్ లీగల్ సర్వీసెస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఓ దివ్యాంగునికి వీల్‌చైర్‌ని సమకూర్చారు. కో ఆర్డినేటర్ అబ్దుల్ వసీ నేతృత్వంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. దివ్యాంగుడు అభ్యర్థించిన రెండు రోజుల్లోనే మెట్రోపాలిటన్ లీగల్ సర్వీసెస్ వీల్‌చైర్‌ను సమకూర్చింది. మెట్రోపాలిటన్ లీగల్ సర్వీసెస్ వారికి లబ్ధిదారుడు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశాడు.

పద్య నాటకాలకు పూర్వ వైభవం రావాలి


ఆకట్టుకున్న శ్రీనాథుడి పద్య నాటకం

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత ఆధునిక సమాజంలో అంతరించి పోతున్న పద్య నాటకాలకు పూర్వ వైభవం రావాల్సిన అవసరం ఎంతగానో ఉందని పలువురు ప్రముఖులు ఉద్ఘాటించారు. మంగళవారం రవీంద్రభారతిలో జీజీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న పద్య నాటకోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా విశ్రాంత డీజీపీ హెచ్‌జే దొర, విశ్రాంత ఐపీఎస్ అధికారులు ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ.. పద్మశ్రీ గుమ్మడి గోపాలకృష్ణ పద్య నాటకోత్సవాలను గౌరవించడం ఎంతో అభినందనీయమన్నారు. ఇటువంటి నాటకోత్సవాలను నిర్వహించడం వల్ల నేటి యువత ఎంతో కొంతైనా నాటక రంగం విలువను తెలుసుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. అనంతరం శ్రీ సత్యసాయి కళానికేతన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన శ్రీనాథుడు నాటకం ఆహూతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి పద్మనాబయ్య, అశ్విని గ్రూఫ్ అధినేత అశ్విని సుబ్బారావు, ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుమ్మడి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

కుట్టుశిక్షణ కేంద్రాన్ని కొనసాగించాలని వినతి


డైరెక్టర్ నరహరికి వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌బీఎస్.అధ్యక్షుడు మదిర సత్యనారాయణ

జియాగూడ: జియాగూడ ఇమాంపురా నవభారత్ సంఘంలో 2వ బ్యాచ్ కుట్టుశిక్షణ కేంద్రాన్ని త్వరలో ప్రారంభించాలని సంఘం అధ్యక్షుడు మదిర సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు మంగళవారం మల్లేపల్లి ఐటీఐలోని హైదరాబాద్ జనశిక్షణ సంస్థాన్ కార్యాలయంలో డైరెక్టర్ ఎస్ఎస్.నరహరిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇమాంపురా నవభారత సంఘం కమ్యూనిటీహాల్‌లో కుట్టుశిక్షణ కేంద్రాన్ని గత సంవత్సరం ప్రారంభించి మహిళలు, యువతులకు మూడు నెలల పాటు కుట్టుశిక్షణ ట్రైనింగ్ ఇచ్చారు. ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు కూడా ఇవ్వాల్సి ఉందన్నారు. రెండవ బ్యాచ్ టైలరింగ్ సెంటర్‌ను కూడా ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నవభారత్ సంఘం ఉపాధ్యక్షుడు జి.వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వై.జశ్వంత్‌కుమార్, కోశాధికారి ఎం.మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరా సరుకుల పంపిణీ


నిత్యావసరాలు అందజేస్తున్న సాయిబాబా చారి

గోల్కొండ: రంజాన్ మాసంలో కులమతాలకు అతీతంగా దశాబ్ద కాలంగా తాము నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నామని గోల్కొండ జగదాంబిక మహంకాళి ఆలయ అమ్మవారి వృత్తిపనివార్ల సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబా చారి అన్నారు. మంగళవారం ఆయన గోల్కొండ రిసాలాబజార్‌లో, ఉర్దూ హైస్కూల్‌లో పారిశుద్ధ్య పనివారికి నిత్యావసరాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోల్కొండ కోట బోనాల నిర్వహణలో స్థానిక ముస్లింలు తమ సహాయ సహకారాలను అందజేస్తున్నారన్నారు. వారి సహాయ సహకారాలకు వెలకట్టలేమని ఆయన అన్నారు. బోనాల ఏర్పాట్లలో వృత్తిపని సంఘం వారు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన అన్నారు. వివిధ రకాల వృత్తిపనివారు వంశపార్యంపరంగా అమ్మవారికి సేవలందిస్తున్నారన్నారు. తమ సంఘం తరపునా సేవా కార్యక్రమాలను మునుముందు కూడా కొనసాగిస్తామని ఆయన అన్నారు. మహంకాళి ఆలయ పూజారి సురేష్ చారి ఉన్నారు.

చారిత్రక కట్టడాలను పరిరక్షించుకోవాలి


వేంకటేశ్వర స్వామి ఆలయంలో అరవింద్‌కుమార్ తదితరులు


పురాతన ధర్మశాలను పరిశీలిస్తున్న అరవింద్‌కుమార్ తదితరులు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో చారిత్రక కట్టడాలు ఎన్నో ఉన్నాయని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ అన్నారు. వరల్డ్ హెరిటేజ్ డే సందర్భంగా మంగళవారం ఆయన గుడిమల్కాపూర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలోని పురాతన కట్టడాలతో పాటు ఆలయం ఎదురుగా గల ఆ నాటి ఆలయ ధర్మశాలను సైతం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ పరిసర ప్రాంతాల్లో శతాబ్దాల క్రితం నిర్మించిన ఆలయాలు, ప్రార్థన స్థలాలు ఎన్నో ఉన్నాయన్నారు. వీటిలో చాలా వరకు శిథిలావస్థలో ఉన్నాయన్నారు. వాటిని తాము పరిరక్షించేందుకు కృషి చేస్తామన్నారు. పాత నగరంలో మక్కా మసీదు నిర్మాణ సమయంలోనే కార్వాన్‌లోని టోలీ మసీదు నిర్మాణం జరిగిందన్నారు. టోలీ మసీదు, దాని ప్రాంగణంలో గల కట్టడాలను సైతం పరిరక్షిస్తామని ఆయన అన్నారు. ఆయన వెంట వాసవి కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్, మెహిదీపట్నం సెయింట్స్ మహిళా కళాశాల విద్యార్థినులు ఉన్నారు.

సమస్యలు తలెత్తకుండా చర్యలు


బస్తీలో మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: రంజాన్ నేపథ్యంలో స్థానిక ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ తెలిపారు. మంగళవారం ఆయన డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రంజాన్ పండగ సందర్భంగా మసీదులు, బస్తీల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న నాలా విస్తరణ, సీసీ రోడ్డు, డ్రైనేజ్ పైప్‌లైన్ అభివృద్ధి నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాని సంబంధిత అధికారులకు సూచించామన్నారు. రంజాన్ రోజున స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయనతో పాటు మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకలు మహ్మద్ వసీముద్దీన్, జీహెచ్‌ఎంసీ, జలమండలి విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీకలు ఇఫ్తార్ విందులు



అబిడ్స్: మత సామరస్యానికి ప్రతీకలు ఇఫ్తార్ విందులు అని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. సుభాన్‌పురా ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండి స్వయంగా వారి పండుగలను కూడా చేపడుతుందన్నారు. మహ్మద్ అహ్మద్, సయ్యద్ అజీజ్, సయ్యద్ యూసుఫ్, సయ్యద్ ఫిరోజ్, సయ్యద్ అఫ్రోజ్, యూనస్, ఫర్దవాస్, సయ్యద్ హకీమ్, సయ్యద్ అజీమ్, కరీమ్, జహంగీర్, ఆసిఫ్, గౌస్, సాజీద్ అన్సారీ, యూసుఫ్, ఇఫ్తెకార్‌అలీ, ఖైసర్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

రేపు జాబ్ మేళా

విజయనగర్‌కాలనీ: రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో ఈనెల 20న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి జయశ్రీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెక్ మహేంద్రా, హెచ్‌ఆర్‌హెచ్ నెక్స్ట్, ఏహెచ్ రిసిస్ట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, కాల్ ఫర్ జాబ్ తదితర సంస్థలలోని 550 ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ, ఆ పై విద్యార్హతతో పాటు 18 సంవత్సరాలు నిండిన వారు అర్హులు. ఎంపికైన వారికి ప్రారంభ నెలసరి వేతనం రూ.12 వేల నుంచి వారి అర్హత, నైపుణ్యాన్ని అనుసరించి రూ.35 వేల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు గురువారం ఉదయం 10:30 గంటలకు ఫొటోలు, సర్టిఫికెట్లతో విజయనగర్‌కాలనీలో ఉన్న రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో నేరుగా హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 90630 99306, 77997 15098లలో సంప్రదించవచ్చు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు కోటి శైలేష్ కురుమ, పప్పుమాత్రే

అబిడ్స్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని గోషామహల్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకుడు కోటి శైలేష్‌కురుమ, పప్పుమాత్రే పేర్కొన్నారు. చందన్‌వాడీలో పర్యటించి అధికారులను రప్పించి విద్యుత్ సమస్యలు పరిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటామన్నారు. ప్రజల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ పార్టీ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రమోహన్, శంకర్, ప్రేమ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి


బీజేపీ నాయకుడు అమర్‌సింగ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలని బీజేపీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ టి.అమర్‌సింగ్ అన్నారు. మంగళవారం కార్వాన్ ఆర్యసమాజ్‌లో జరిగిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనకు శాలువా కప్పి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షుడు సునీల్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

ఆషూర్‌ఖానాలను సందర్శించిన ఇస్లామిక్ స్కాలర్


ఆలంను దర్శించుకుంటున్న ప్రముఖ ఇస్లామిక్ స్కాలర్ మౌలానా డాక్టర్ షబ్బీర్ అలీ వర్సీ ఖిబ్లా

చార్మినార్: పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రముఖ ఇస్లామిక్ స్కాలర్ మౌలానా డాక్టర్ షబ్బీర్ అలీ వర్సీ ఖిబ్లా మంగళవారం పాతబస్తీలోని పలు ఆషూర్‌ఖానాలను సందర్శించి పూలు, దట్టీలు సమర్పించారు. బీజేపీ రాష్ట్ర మాజీ అధికారి ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ ఆధ్వర్యంలో దారుషిఫాలోని ఆజాఖానా జహీరా, పంజేషాలోని అలావే సర్తుఖా తదితర ఆషూర్‌ఖానాలను సందర్శించి ఆలంలకు పూలు, దట్టీలను సమర్పించారు.

తమ్ముడి పరీక్ష రాసిన అన్నకు మూడేళ్ల జైలు

బహదూర్‌పురా: తమ్ముడి కోసం పరీక్ష రాసిన అన్నకు కోర్టు మూడేళ్లు జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. వివరాల ప్రకారం.. 2017లో కులీకుతుబ్‌షా కాలేజీలో డిప్లొమా సప్లిమెంటరీ మ్యాథ్స్ పరీక్ష పేపర్‌లో ఎండీ అసిమ్ ఖాన్‌కి బదులుగా సోదరుడు ఎండీ సోహేల్ ఖాన్ పరీక్ష రాస్తుండగా పోలీసులు అతన్ని పట్టుకొని అరెస్ట్ చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు సోహేల్ ఖాన్‌ను మంగళవారం కోర్టులో హాజరు పరచగా మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.